# కొలతలు

నలుదిక్కులా బోర్డులతో నాలుగు రోడ్ల కూడలిని ఏర్పరిచాయి, ఆ నాలుగు కార్యాలయాలూ . మండలంలోని అన్ని గ్రామాల వారికి ఈ కార్యాలయాల అవసరం ఇంతా అంతా కాదు. "పల్లెల ముంగిటకు ప్రభుత్వం" అనే నినాదంతో ఒక పార్టీ ఏలుబడిలో వెలసిన ఈ కార్యాలయాలు - తెలుగు నాట ప్రతి ఇంటినీ తమ చుట్టూ తిప్పుకుంటున్నాయి.

దట్టమైన అడవిలో ఊడలు దిగిన మర్రిచెట్టులా "మండల ప్రజాపరిషత్"ఆఫీసు ఉత్తరాన ఉంది. పడమర "మండల రెవెన్యూ" ఆఫీసు, వీటిని కాపు కాసేట్లుగా దక్షిణాన "రక్షకభట ఠాణా" తుపాకుల్తో నిల్చుంది. దానికి పక్కగా తూర్పున ఇనప బీరువాలా 'బ్యాంకు' ఉంది.

దుమ్ము రేపుతూ ఆగిన బస్సులోంచి దిగిన దాలప్పడు భుజం మీది తువ్వాలుతో మొహం తుడుచుకుని మండల రెవిన్యూ ఆఫీసుకు కాళ్లీడ్చాడు. ఉదయం పదిగంటల ఎండ ఎల్డీసీ కలంలా - చక చకా వేడెక్కుతోంది.

మండల రెవిన్యూ కార్యాలయం ముందు - మూడు అశోకచెట్లు పనిమీద వచ్చి వుండిపోయిన రైతుల్లా నిల్చున్నాయి. ఓ చెట్టు నీడలో - దరకాస్తులు రాయటానికీ, స్టాంపులు అమ్మటానికీ ఓ ముసలాయన కళ్లద్దాలు పరిచి కాచుక్కూర్చున్నాడు. మరో చెట్టుకు ఆనించి అమ్మాజమ్మ టీ దుకాణం పొగ వదుల్తోంది. మిగిలిన మూడో చెట్టు నీడన నలుగురైదుగురు రైతులు ఎమ్మార్వో కోసం ఎదురు చూస్తున్నారు.

దాలప్పడికి తెలిసిన మొహం ఏదీ కనపడలేదు. ఆఫీసు తలుపులు తెరిచి ఉన్నా - భక్తులు లేని కోవెలలా ఉంది. అమ్మాజమ్మ టీపాకకు నడిచేడు దాలప్పడు. అమ్మాజమ్మ పువ్వుల నైలాను చీరా, టూబైటూ జాకెట్‌తో, పూలు ముడిచిన అందంతో మరింత వయ్యారాలు పోతోంది. దాలప్పడిని చూసి-

"టియ్యేనా ? టిఫినా?" అడిగింది. దాలప్పడు బదులివ్వలేదు. ఆ ప్రశ్న తనకు గాదు అనుకున్నాడు. అసలు అమ్మాజమ్మ అడిగితేనే అలా ఉంటుంది దాలప్పడ్ని అడుగుతూ - దారివైపు చూపులు విసురుతుంది. దాలప్పడు పలకప్పోయేసరికి -

" అత్తోరింటికొచ్చిన అల్లుడ్లాగ - బెంచీ ఎక్కిపోయి ఉలకడూ, పలకడేటీ ?" అంది నవ్వుతూ. ఆ వికటానికి, పాకలో బల్లమీద కూర్చున్న నలుగురైదుగురు నవ్వేరు. దాలప్పడు అప్పటికి తేరుకొని ఏమిటన్నట్లు అమ్మాజీవైపు చూస్తే -

"ఏటి గావాలా?" నవ్వును ఆపుకుంటూ అడిగింది అమ్మాజమ్మ

"వొట్టినే ! ఆఫీసు పని మీదొచ్చేను" దాలప్పడు.

"ఆఫీసు పనిమీదొచ్చేవు గాబట్టే టీకొట్టు చూసేవు. లేపోతే సూసిన మొకమేనేటి నీది ?" అంది మళ్లీ అమ్మాజీ.

ఆ మాటకు మళ్లీ నవ్వేరు నలుగురూ. దాలప్పడికి వాళ్లు ఎందుకు అలా నవ్వుతున్నారో, అమ్మాజమ్మ ఎందుకలా యెగతాళి చేస్తోందో తెలీదు. మామూలుగానే -

"మా ఇంటి మొగం, మా ఇంటిదాని మొగం తప్ప వీధి మొగమూ, వీధిలోని మీ మొగాలు సూసెరగను " అనేసి లేచి వెళ్ళిపోయాడు. ఆ దెబ్బకు అమ్మాజమ్మ మౌనం వహించింది.

నవ్విన నలుగురూ"సరిగ్గా కొట్టేడు దెబ్బ" అనుకొన్నారు. ఎవరో"అరుగో ఎమ్మార్వోగారు" అన్నారు. ఒక్కసారిగా అక్కడ అలికిడి ప్రారంభమైంది.

ఎమ్మార్వోగారికి అందరూ దండాలుపెట్టారు. ఎవరి దండాలూ అందుకోలేదాయన. ఆయన చేతి బ్రీఫ్‌కేసును ఓ బంట్రోతు అందుకున్నాడు. మరో బంట్రోతు అయ్యగారి కుర్చీ దులిపిసర్దేడు. అయ్యగారు ఆసీనులయ్యాక ఒక్కొక్కర్నీ లోపలికి వదులుతున్నాడు బంట్రోతు. మధ్యాహ్నం పన్నెండు గంటలవేళ - దాలప్పడ్ని లోపలికి అనుమతించేడు బంట్రోతు.

దాలప్పడు పట్టాకాగితాన్నీ, శిస్తు రసీదుల్నీ, కోర్టు నోటీసుల్నీ వాటితోపాటే కలిపి దాచిన పెండ్లి పిలుపు కార్డుల్నీ, అన్నీ కలిపి కట్టిన గుడ్డ మూటని విప్పేడు. ఎమ్మార్వో ఆ కట్టలో పెండ్లి పిలుపు కార్డులు చూపి కళ్లెర్రచేసి -

"యేఁవిటిది? కవిలి కట్టంతా విప్పేవేంటి? దరకాస్తేది" గసిరేరు.

"..... అదిగాదా ! అందల పట్టా కాయితముంతాది సూడు బావ్" అని గొణిగాడు దాలప్పడు.

" నాకేం పన్లేదనుకున్నావా - కవిలి కట్టంతా వెదకటానికి?" అని కేకేసి బెల్‌కొట్టేరు. బంట్రోతు వచ్చి దాలప్పడిని కళ్లద్దాల చెట్టుకాడకు పోయి దరకాస్తు రాయించుకు రమ్మన్నాడు - చెట్టు నీడలోని ముసిలోడు దాలప్పడి దగ్గర రెండు రూపాయలు తీసుకొని దరఖాస్తు రాసిచ్చేడు. దరఖాస్తుతో దాలప్పడు తిరిగొచ్చేసరికి అయ్యగారు కుర్చీ దిగిపోయారు. లంచ్‌రెస్ట్‌లో ఉన్నారు. గది ద్వారం దగ్గర స్టూలు మీద బిల్ల బంట్రోతు జనపమావు మీద ఒంటికాలితో కునికే కొంగలా కళ్లు మూసిజోగుతున్నాడు. రెబ్బ కొండల్లోంచి వేడిగాలి దాలప్పడి మొహమ్మీద కొట్టింది. తువ్వాలు దులిపి - అక్కడే గోడకి చేరబడ్డాడు.

ఎండ కొద్దిగా కొండ వాలుకు తిరిగే వేళకి అయ్యగారు కుర్చీలో కూర్చున్నారు. దాలప్పడు దండాలు పెడ్తూ, కడుపు సొదంతా విన్పించేడు.

"పట్టా బావ్ ఇది. తమకంట ముందలిక్కడ పన్జేసిన ఎమ్మార్వో బావ్‌ఇచ్చిన పట్టా ! సర్వేయరు బావ్.... కొలిసి వొప్పజెప్పారు భూమి . అదిగా భూమిల తూప్పొడొంకా నరికి, వొరకట్టి మల్లు గట్టేసరికి నాను నలిగిపోనాను. నాలుగు పంటలు గడిసిపోనాయి. ఇప్పుడు సరిగ్గా యవసాయంకి పనికొత్తది అనేసరికి... ఆ భూమ్మీద నాకు హక్కులేదట ! ఆ పట్టా సెల్లదట ! సూడండి బావ్... అన్నేయిం?" అని ఇంకా చెప్పబోయేడు దాలప్పడు. గానీ, దరకాస్తు పైకి కళ్లు విసిరిన ఎమ్మార్వో - చేత్తో సైగజేసారు నువ్విక వెళ్లొచ్చు అన్నట్లు.

దాలప్పడు ఏదో చెప్పబోతే - బెల్ మోతకు వచ్చిన బంట్రోతు దాలప్పడ్ని బయటకు వచ్చేయమన్నాడు. బయటకు వచ్చిన దాలప్పడు బంట్రోతుని పట్టుకొని బతిమాలితే - "దరకాస్తిచ్చేవు గదా చూస్తార్లే, చూసి, తగిన చర్య తీసుకుంటారు. నీకు లెటరొస్తాదిలే. పర్లేదు పద,పద -పకోడి ఇప్పించు' ' అని అమ్మాజీ టీ పాకకు లాక్కెళ్లాడు.

బొడ్డు కొంగులోని డబ్బులు ఖర్చుకాగా దిగాలుగా ఇంటి దారి పట్టాడు దాలప్పడు.

★ ★ ★

నెల రోజులు గడిచినా ఏ కబురూ రాలేదు, కవరూ రాలేదు. అరుద్ర కార్తెవచ్చింది. ఆకు పోతలకు దిగారు రైతులు. దాలప్పడు సాలుబోసి ఆకుమడి దున్నుతున్నాడు. రాత్రెపుడో కురిసిన వానకు నేల

దుక్కిపదును మీద ఉంది. నాగలి పెకలించిన మట్టి పారలు, పారలుగా తల క్రిందులవుతోంది. మట్టి పారల్లోంచి అక్కడక్కడా అరుద్ర పురుగులు సాలుల్లోంచి గట్టు మీదకు ఎగబాకుతున్నాయి. కుట్టుదీసిన పొయ్యిలా మబ్బు చెదిరిన ఎండమండిపోతోంది. చల్దన్నం తీసుకొని - భార్యవచ్చింది. గట్టు మీద తపేల దించి దాలప్పడి నాగలి వెనకనే నడుస్తూ, గరిక దుబ్బుల్ని యేరిపారేస్తూ కబుర్లు చెప్తోంది. తూర్పుతిన్నగా సాలు కొసకి నాగలి చేరేసరికి ఎదురుగా ఎర్ర టోపీతో ఇద్దరు కానిస్టేబుళ్లు, ఖాకీ టోపీతో ఓ ఎస్సయీ కనబడ్డారు. దాలప్పడికి ఎడమ కన్ను టప, టపా కొట్టుకుంది. దాలప్పడికి పోలీసులు - ఆవుకి ఎదురైన పులుల్లా కన్పించేరు.

కానిస్టేబుళ్లు - నాగలి విప్పేసి, ఎడ్లని తగిలేశారు. దాలప్పడి భార్య గబ, గబా భర్తను చేరుకుంది. వారిద్దరి మొహాల మీద లాఠీని - యముని పాశంలా ఊపుతూ -

".... యికనించీ ఈ భూమిని దున్నకూడదు" హెచ్చరించేడు ఎస్సయ్. దాలప్పడికి యేమీ పాలు బోవటం లేదు. ఏమనాలో తెలీక ఎస్సయి వైపు దీనంగా చూస్తుండిపోయాడు. దాలప్పడి భార్య మాత్రం -

"... అదేటి బావూ అలగంతారు. ఈ భూమి మాదీ." అంది.

"..మీది అని - నువ్వు చెప్తే సరేనేంటి?" ఎస్సయ్.

".. మరెవులు సెప్పాల?" దాలప్పడి భార్య.

"... రికార్డులు చెప్పాల. రివెన్యూ వాళ్లు చెప్పాల. రిజిస్ట్రాఫీస్ వారు చెప్పాల. మేము వొప్పుకోవాల.' ' ఆ ఎస్సయికి బదులుగా కానిస్టేబుల్ చెప్పాడు.

"... అది గందికే, యెమ్మార్వో కాడకెల్నాను. పట్టాని సూడమంతే.. దరకాస్తిమ్మన్నారు. రొండు రూపాయలు పెట్టి దరకాస్తు రాపించేను. బంట్రోతు కర్సులు బంట్రోతుకిచ్చుకున్నాను. ఎమ్మార్వో బావుకి.. దండం పెట్టి దరకాస్తిచ్చుకున్నాను" అమాయకంగా వివరించేడు దాలప్పడు.

".. అదంతా మాకనవసరం. ఇది జిరాయితీ చెరువు గర్భమనీ దీనికింద ఆయకట్టు భూమి యెంతో వుందనీ- గనక దీన్ని చెరువుగా మాత్రమే వుంచాలనీ, మడిసెక్కలు జేసి, సేద్యం జేస్తే ఆయకట్టు భూమికి నీటి ఆధరువు వుండదనీ రిపోర్టిచ్చేరు జోగినాయుడుగారు. దురాక్రమణజేసి నువ్వు దున్నుతున్నావని కేసు పెట్టారు తెల్సిందా?" మరో కానిస్టేబుల్ కేసు చిట్టావిప్పి చెప్పాడు..

" ఆఁ ! ఆయకట్టేటి? కేసేటి ? దురాక్రమనేటి? యేటిబావ్ ఈ తిరకాసులు?నాయుడు గోరి బారికోడుకాంచి, ఎమ్మార్వో బావుదాక.. పట్టరాని కాళ్లన్నీ పడితే అడిగినోరికల్లా లేదనకండా సదివించుకుంతే.. ఇదిగాదా ఈ సెక్కకి పట్టా యిచ్చారు. ఇదిఈ పోరంబోకు నేలని మూడు సంవత్సరాలు వొల్లు గుల్ల జేసుకుని మడిసెక్కని జేశాను. ఇదిగీ యేడు యిత్తనాలు బోసి పంట యేద్దుమంతే - యిది నేను దున్న గూడదా? మరిన్నాళ్ల నా కట్టం మాటేటి ? నాకిచ్చిన పట్టా మాటేటి బావ్?" అడిగేడు దాలప్పడు.

".. అవన్నీ తేల్సవల్సినోల్లు తేలుస్తారు ? నువ్వు మాత్రం భూమి దున్నటానికి వీల్లేదు ఆ " అని ఎస్సయ్ ఆర్డరేశారు.

".. తాళి సూపినా పెళ్లాన్ని యేలుకోగూడదన్న మాట ? సెబాస్ బావో సెబాస్.. యేలినోరి తీరవని యెవులు కాదనీగల్రు ? అలగేని బావ్.. అలగేని." అన్నాడు దాలప్పడు.

"... అలగేనంటే ? అసల్నువ్వు యేవంటన్నావో బోధపడ్లే... సర్సరే చూడొరే, నువ్వు మళ్లా ఈ భూమిల అడుగుపెడ్తే మరి నువ్వు నీ యింటిల అడుగెయ్యివు. ఆఁ ? జేగర్త" అని హెచ్చరించి వెళ్లిపోయారు శాంతిభద్రతల రక్షకభటులు.

ఆరుద్ర కార్తె ఎండ ముదిరి - వేడిగా గాలి విసిరికొట్టింది. దాలప్పడు దిగాలుగా మడి గట్టుమీద చతికిల బడినాడు. భార్య తెచ్చిన చల్లన్నం తపేలా మీది మూతని కాకులు పొడుస్తున్నవి. మడిలో నాగలి లంగరేసిన ఓడలా వుంది .

దిగాలుగా వున్న దాలప్పడికి - కన్నబాబుని గుర్తు చేసింది భార్య

★ ★ ★

కన్నం నాయుడుని .. అందరూ కన్నబాబు అని పిలుస్తారు. మండలస్థాయి క్రియాశీల కార్యకర్త నుంచి జిల్లా స్థాయి రాజకీయ నాయకుడిగా యెదిగాడు కన్నబాబు. పార్వతీపురం పశువుల సంతలో పాడిగేదెల కొనుగోలులో .. పార్వతీపురం పార్లమెంటు యెంబరుకి సహకరించిన కన్నబాబు, ఆ తర్వాత ఎంపీ గారికి యెంతో నమ్మకస్తుడైనాడు. సంతలు వొదిలేసి, గ్రామాల మీద పడ్డాడు. సన్న, చిన్నకారు జనాలు కొందరికి పచ్చకార్డు లిప్పించడంలో పచ్చచొక్కా లిప్పించటంలో సబ్సిడీ మీద బ్యాంకు ఋణాలిప్పించడంలో కన్నబాబు పేరు మార్మోగింది.మండలంలో కన్నబాబు .. ఓటు బ్యాంకు కాగలిగేడు. అతని సేవల్ని గుర్తించిన పార్టీ "గ్రంథాలయ సంస్థ అధ్యక్షపదవి" ని ఆఫర్ చేస్తే కన్నబాబు సున్నితంగా తిరస్కరించాడు. పదవుల కోసం పనిచేయలేదన్నాడు. అది గాక, గ్రంథాలయమంటే వివేకుల దేవాలయం. అందులో నాలాంటివారికి చోటుండగూడదు, తప్పు - అన్నాడు. పార్టీ అతని నిర్మలత్వానికీ, నిస్వార్థానికీ ముక్కున వేలేసుకుంది. అయినా - కన్నబాబు సేవకు గుర్తింపుగా యేదో వొక పదవి యివ్వాలనే ధృఢ నిర్ణయంతో - "సహకార బ్యాంక్" అధ్యక్షున్ని చేసింది. కాదనలేకపోయాడు కన్నం నాయుడు. "సహకారం అన్న ఆలోచనే గదా - నన్ను రాజకీయాల్లోకి దింపింది." అని పత్రికా విలేఖర్ల ప్రశ్నకు జవాబిచ్చేడు.

జిల్లా సహకార బ్యాంక్ అధ్యక్షులు కన్నబాబు - యింటి గేటు దగ్గర నిలబడిన దాలప్పడికి కళ్లు తిరిగిపోయేయి.

తన చేత పట్టాకోసం దరకాస్తు పెట్టించిన రోజుల్లో - కన్నబాబు చిన్నపెంకుటింట్లో వుండేవాడు. పెంకులమీద నాచుపట్టి గడ్డి మొలిచీ.. అక్కడక్కడా కన్నాల్తోవుండేది. గోడలు.. వయసుమీరి నిలబడలేక నిలబడేవి ఆ పెంకుటింటిముందు జాగాలో చిన్నపాక, నులక మంచం... అందులో కన్నబాబు వుండేవాడు.

ఎంతలో యెంత మార్పు ? త్రినాథ మేళా చేసి తిరిగి యింటి కొచ్చిన బాపనయ్య పాక.. భవంతి అయినట్లుగా కన్పించింది, కన్నబాబు బిల్డింగ్ . ఖాళీ జాగాలో పాక.. విజిటర్స్ రూము అయింది పాత పెంకుటిల్లు రెండతస్తుల భవంతి అయ్యింది. గేటు తియ్యటం రాని దాలప్పడు గేటు దగ్గరే ఆగితే, యెవరోవచ్చి గేటు తీస్తే లోనకి నడిచేడు.

లోనికి వెళ్లిన దాలప్పడికి కన్నబాబు కన్పించలే. తెల్లబట్టల ఆఫీసర్లూ గొలుసంచు పంచెలూ, కండువాల పెద్దలూ, కన్పించేరు. అందరికీ దండాలెట్టి విజిటర్స్ గదివారగా నిల్చున్నాడు దాలప్పడు. కొంతసేపటికి కన్నబాబు దిగేరు. తెల్లబట్టలూ కండువాలూ లేచి నిలబడ్డాయి. దాలప్పడు దండాలు పెట్టి పరిచయంగా దగ్గరికి వెళ్లబోతే, ఫైలుచూపుతూ ఆఫీసర్ అడ్డుతగిలేడు కండువా మనిషి పక్కకి తీసికెళ్లేడు.

తిరిగొచ్చి కూర్చున్న కన్నబాబు .. పక్కనున్న ఫోను అందుకున్నారు. పావుగంటసేపు యెక్కడెక్కడి వారితో మాట్లాడేరు ఆ తర్వాత, అప్పుడు దాలప్పడి కాయితాన్ని అందుకొని -- .

".. పట్టా కాయితం కదవోయ్.." అన్నారు.

"అవును బావ్. తమరు యిప్పించిందే"

"అవునవును. మాగాణి సమారాధన పేర్న మీ ఊరి బెల్లాన చెరువు భూమి గదా యిప్పించేను. మరింకేమి? దీనిమీద లోన్సు కావాలేటి ? భూమి యిప్పించిందాక భూమో భూమంటారు. భూమి యిప్పిస్తే దానిమీద లోన్సు అంటారు. ఎప్పుడూ యేదో ఒకటి యిప్పించితేగానీ వొదలయ్యా మమ్మల్ని" అని నవ్వేరు సరదాగా కన్నబాబుగారు.

ఆ నవ్వుకి అక్కడి కండువాలూ, తెల్లదుస్తులూ కర,కర నవ్వేయి. నవ్వలాగేక దాలప్పడు -

"కాదుబావ్. ఆ సెరువుగర్భం సదును సేసి, వొరకట్టి మల్లు గట్టింతర్వాత యిపుడేమో దున్న గూడదంతన్రు." అని చెప్పేడు.

"ఎవుడాడు..?" ఆశ్చర్యమో, ఆగ్రహమో కన్నబాబు స్వరంలో. దాలప్పడు విషయం చెప్పాడు.

బెల్లాన చెరువు కింద ఆయకట్టు రైతుల్లో పెద్ద రైతు జోగినాయుడు. ఆ జోగినాయుడికి యెక్కువ భూమే గాక, పెద్ద రైస్ మిల్లుంది. రైసుమిల్లు గాక - నాయుడి సంతానానికి పెద్ద పెద్దహోదాల్లో ఉద్యోగాలున్నవి. బంధువుల్లో మారిన గవర్నమెంటులో మంత్రి పదవులున్నవి. ఇన్ని వున్న నాయుడికి 'చెరువు గర్భం' పట్టా జేయించుకున్న దాలప్పడిమీద కోపముంది. ఆ కోపంతో తొలుత పోలీసుల్ని వదిలేడు.

"అదా సంగతి. మరి ఎమ్మార్వో యేం జేస్తున్నాడు?" అడిగేడు కన్నబాబు.

"దరకాస్తు ఇస్తే, సూస్తానెల్లు అనేసాడు" చెప్పాడు దాలప్పడు.

"ఒట్టి దరకాస్తులు సూస్తాడేటి యెమ్మార్వో? ఆటికి జెత సెయ్యాల్సినివో..?" కండువా వొకటి కక్ష కొద్దీ యెమ్మార్వోల లంచగొండితనాన్ని విన్పించింది.

ఆ స్వరానికి తెల్లదుస్తులు యిరకాటంగా కదిలాయి. అది గ్రహించిన కన్నబాబు-

"సర్లే నేను చెప్తాన్లే" అన్నాడు

"ఆకుపోతల కార్తె అయిపోతంది బావ్. ఈ యేటి పంటకి దారిసూపాల" దాలప్పడు చెప్పగా.

"యెల్లవయ్యా సూస్తార్లే ఇంకా యీపొద్దు వచ్చేవు, రేపటికి భూమి యిప్పించీమంతే ఆ బావుకి మాత్రం వొల్లవొద్దూ . అందులోకి ఆ బావు అప్పోజిసన్ పార్టీలున్నాడు గానీ, అధికార పార్టీల కాదు గదా?' అని నెమ్మది వహించమని ఓ కండువా బదులివ్వగా --

".. అందికే, అప్పోజిషన్ పార్టీ వొదిలేసి, అధికార పార్టీలోకొచ్చీ బాబూ, అని డెంకాడ రాజుగారు కవురు మీద కవురెడతన్రు. ఈ బాబే అవుననరు, కాదనరు." అని కన్నబాబుని పార్టీ మారమని మరో కండువా కోరింది.

"నిజమే ఏ పనిజరగాలన్నా కష్టంగుంది. కన్నబాబు పేరు చెబితే కలక్టరేట్‌నుండి సెక్రటేరియట్ దాక ఫైళ్ళు పరిగెట్టేవి. ఇప్పుడు యెక్కడివక్కడాగిపోతున్నాయి." అనితెల్లదుస్తుల ఆఫీసరొకడు ఫైళ్ళ కష్టాల్ని చెప్పాడు.

చివరికి దాలప్పడి సమస్య మరుగున పడి, కన్నబాబు పార్టీ మార్పిడి చర్చకు వచ్చింది. దాలప్పడికి యేమనాలో తోచక పట్టాకాయితం పట్టుకు నిల్చున్నాడు. దాలప్పడు యీచర్చలో వుండటం నచ్చని కన్నబాబు-

"నువ్వెల్లవోయి. తొందరగే తేలుస్తాన్లే" అన్నారు.

దాలప్పడికి తన సమస్య కన్నబాబు అన్నట్లు తొందరగానే తేలుతుందో ? కండువావారు అన్నట్లు యీ పంట పోయింతర్వాత తేల్తుందో బోధపడలేదు. అయినా అందరికీ దండాలెట్టి సెలవు తీసుకొన్నాడు.

దాలప్పడు వెళ్లాక, పార్టీ మార్పిడి కోసం డెంకాడ రాజుగారి నుండి రాయభారం తెచ్చిన కండువా-

"అయితింతకీ యేటంటావ్?" అనడిగింది.

"దేనికి యేటండము?" అడిగేడు కన్నబాబు.

"అధికార పార్టీలోకి మారడంకి" చెప్పింది కండువా.

"అదా చూద్దాం. ఏ పార్టీ మాత్రం తిన్నగుంది? ఆ పార్టీలోనా అసమ్మతి గ్రూపులే. ఎన్నాళ్లు నిలబడతాదో చెప్పగలమేటి? చూద్దాం. అన్నీ చూసి అడుగెయ్యాల గదా" అని, ఆ చర్చని ముగించేరు కన్నబాబు.

మరింకయే కండువా గూడా దాన్ని పొడిగించలేదు.

అప్పటికి ఉదయం పదకొండు గంటలు దాటుతోంది. ఆఫీసర్లు సెలవు తీసుకువెలిపోయాక, కండువా పెద్దలూ కదిలిపోయేరు.

ఆ తర్వాత, ఓ గంటకు కన్నబాబూ, వారి పి.ఏ. మాత్రం 'గోదావరి లింక్ ఎక్స్ ప్రెస్ ' అందుకోటానికి కారెక్కారు. హైదరాబాద్ లో కన్నబాబు వారం రోజులుంటారు - అధికార పార్టీ అసమ్మతి గ్రూపుతోనూ, స్వపక్ష పార్టీ అధినాయకునితోనూ మంతనాల కోసం.

ఆ విషయం కండువాలకూ తెలీదు. తెల్లబట్టలకీ తెలీదు. చిరిగిన పంచెలకు అసలే తెలీదు.

★ ★ ★

ఆరుద్రకార్తె చూస్తుండగానే గడిచిపోయింది. ఆకుమళ్లు పచ్చగా, రెపరెపలాడ్తూ ఉడుపుకు యెదిగివస్తే దాలప్పడి కొర్నుమడి మాత్రం చూలుపోయిన ఆవులా వుంది. కొర్నుండిపోయిన మడి దగ్గరికి పూటకోసారి తిరిగొచ్చేవాడు దాలప్పడు. వారానికి రెండుసార్లు ఎమ్మార్వో దగ్గరికీ, కన్నబాబు దగ్గరకీ వెళ్లివచ్చేవాడు. ఇంటిలోని పాత ట్రంకు పెట్టెలో దాచిన పట్టాకాయితాన్ని బందిల దొడ్డిలోని దూడలా చూస్తూ రాత్రిళ్ళు బాధపడేవాడు.

అసలే అసంతృప్తితో, విసుగుతో అపుడే ఇంటికి చేరిన ఓ సాయంత్రం వేళ....

"కూలీ లేదు, నాలీ లేదు పూటకోపాలి మడికాడకీ,రోజుకోపాలి ఆఫీసులికీ తిరగటమే మిగిలింది. ఏల పనికి మాలిన తిరుగులు? ఆ మడికో దండం పెట్టేసి, ఆ పట్టాకాయితం పాయిలెట్టేసి కూలీనాలికెలిపోతే బత్తెం గింజలేనా వొచ్చును" అని భార్య ఉసురుమనటంతో, యెక్కడలేని చిరాకూ కల్గింది దాలప్పడికి . దాంతో కోపంగా -

"నీనేటి సరదాకి తిరుగుతున్నానే? ఎవులిదగ్గరికెల్తే యే దారిసూపుతారో అని ఆశకొద్దీ కాలుకు బలపాలు గట్టుకొని తిరుగుతన్ను. ఇంటిల గూకొనున్ని దానివి. నీక్కష్టంగుందేటి?" అని కేకలేశాడు.

".... ఆఁ యింటిల గూకొని నువ్వు పాతర పోసిన గింజలు తరగేసి తిండానికి కష్టం గాదా? ఇదిగో యీ పట్టా కాయితమే మిగిలింది పొయ్యిల పెట్టడంకి" అని జవాబిచ్చింది భార్య.

ఆ జవాబుతో దాలప్పడిలో రగుల్తోన్న అసమర్థుని అసహనం.. మంటలా లేచింది. ఆవేశంతో భార్య జుత్తు చేతబుచ్చుకొని -

"మాటి, మాటికీ పట్టా కాయితం పొయ్యిలెట్టీయాల, పొయ్యిలెట్టీయాలని అరుస్తావేటే దెస్టా? నీ దరిద్రమే తినీసింది. నిన్ను పొయ్యిలెట్టీయాల ?" అని పంచలోకి యీడ్చేడు.

ఇరుగూ, పొరుగూ చేరిపోయారు. ఇంటిగోల వీధి కెక్కింది. అప్పుడు వొదిలింది దాలప్పడికి అసహనంతో కలిగిన అనవసర కోపం. సిగ్గుపడిపోయాడు. చల్లగా వీధిలోకి జారుకున్నాడు . ఏడుస్తూనే ఆ యిల్లాలు.. చీకటింటిలో దీపం వెలిగించింది. కళ్ళు తుడుచుకుని, ముక్కు చీదుకుని నులకమంచమ్మీద కునుకుదీస్తున్న పిల్లాడ్ని లేపి భర్త కోసం వీధిలోకి పంపింది.

ఆ రాత్రి ... పాత ట్రంకు పెట్టె తెరవనూలేదు. బందెల దొడ్డిలో దూడలా వున్న పట్టాకాయితాన్ని చూడనూలేదు దాలప్పడు ఆలోచిస్తూ నిద్రలోకి జారిపోయాడు.

★ ★ ★

ఆ మర్నాడు ఉదయమే బయల్దేరాడు దాలప్పడు కన్నబాబు దగ్గరకు. ఆవేళ అటో, ఇటో తేల్చుకోవాలనుకున్నాడు. ఇప్పటిదాకా ఎమ్మార్వోకి చెప్పాననీ, ఎమ్మార్వో సబ్ కలెక్టర్ని కలవమన్నాడనీ, కలక్టర్ని కలవటం అవలేదనీ చెప్పుకొస్తున్న కన్నబాబుని అయితే ఔతాదనీ, కాకపోతే కాదనీ చెప్పేమంటానని బయల్దేరాడు దాలప్పడు.

దాలప్పడు వెళ్లేసరికి కన్నబాబుగారి విజిటర్స్ గది నిండా ఖద్దరు పెద్దలు ఏదో విషయాన్ని తీవ్రంగా చర్చించుకుంటున్నట్లుంది. ఎవరిదో గొంతు -

'వొక గవర్నమెంటు పడిపోయింది. మరో గవర్నమెంటు గడ, గడ లాడిపోతూంది. రామజన్మభూమి మాత్రం తేలకుంది " విన్పించింది దాలప్పడికి. చేతులు జోడించి లోపలికి చూసాడు దాలప్పడు. గది మధ్యలో ఈజీచైర్‌లో కూర్చున్న కన్నబాబు దాలప్పడ్ని చూసి బయటికి కదిలాడు. కన్నబాబుకి, కొద్ది దూరాన సోఫాల కూర్చున్న జోగినాయుణ్ణి చూసేసరికి దాలప్పడి ఎడమకన్ను బెదిరింది. కన్నబాబు బయటికొచ్చి, దాలప్పడ్ని నడిపించుకుని పక్కకి తీసికెళ్ళి -

" అదన్నమాట. రెండుసార్లు పోనులో మాట్లాడేను. గట్టిగ చెప్పాను కలక్టరికి. ఆ తర్వాత, ఈ మధ్యనే వొక మీటింగుల కలిస్తే అడిగీసాను ముకమ్మీద అలగిలక్కాదు. అప్పుడన్నాడు.. కలక్టరు..." అని ఆగి జేబుల్తడిమీ అగ్గి పెట్టీ, సిగరేట్ పెట్టీ దీసాడు కన్నబాబు.

"... యేటన్నాడో కలక్టు?" అనుకుంటూ కన్నబాబు దిక్కే ఆశగా దాలప్పడు చూస్తుంటే.. సిగరెట్ వెలిగించి, ఒక దమ్ములాగి-

" నిజమే గానీ, అదీ జిరాయితీ చెరువనీ, ఆ జోగినాయుడు కోర్టుకెల్లి 'స్టే' తెచ్చుకున్నాడనీ- అందుకని మరేం చెయ్యలేమని అనీసాడు కలట్రు... " అని చెప్పాడు కన్నబాబు.

గుండెల్లో రాయి పడిపోయింది దాలప్పడికి, ఎక్కడలేని నీరసమూ వొచ్చేసింది.

" మరిప్పుడెలగయితే. పట్టాకాయితం పొయ్యి లెట్టీడిమేనా? " అన్నాడు దాలప్పడు.

"అలాగంటే యెలాగయ్యా? పొయ్యిలో పెట్టడానికా పట్టాలిప్పించాను. నా మీద అలుగుతావేటయ్యా? మంచోడివే" అని దాలప్పడి భుజం చరిచి, హాస్యంలోకి దించబోతూ, మళ్లీ సర్దుకొని -

"అవతలోల్లు తెచ్చిన 'స్టే' చెల్లదని నువ్వు కోర్టుకి వెళ్లొచ్చు" అని సలహా యిచ్చేడు కన్నబాబు.

"పట్టా కోసం... ఇంటిలోని గిన్నీ ముంతలు అమ్మీసాను. కోర్టుకెల్తే ఇల్లు అమ్మీయాల" బాధను వ్యక్తం చేసాడు దాలప్పడు.

" మరి ఎలాగయ్యా ? మీతో యిదేబాధ. భూములు రావటమంటే తేలికా ? నీ యిష్టమిక .. " అనీసి కన్నబాబు వెనుదిరిగి లోనకినడవబోయాడు.

అప్పుడు దాలప్పడు -

"... బావూ మరేటనుకోకు. ఈ పట్టా కాయితం తమ కాడే వుంచుకోండి. మాము సిన్నపుడు దసరా పండుగని, బట్టలు కొనమని మా నాయినని దూసుకుతినేసోలిమి. మా నాయినకి- అవి పంటల మదుపు సీజను. చేతిల డబ్బు లాడేవిగావు. మా గోల మాదే? ఇలగ్గాదని, మమ్మల్ని టైలేరు కాడకి తీసికెల్లి కొల్తలు తీయించీసేవోడు. మాము సంబరపడిపోయీ వోలిమి.

రోజులు గడిసిపోయీవి. దసరా యెలిపోయీది. టైలేరు బట్టలిచ్చీవోడుగాదు. ఏటీ తిప్పడం? నువ్వీ పొద్దు యిత్తావా,సత్తావా? అని టైలేరు పీకమీద గూకుంటే, అప్పుడు సెప్పోడు టైలేరు మా నాయన కొలతలు దియ్యించాడు గాని, మాకు గుడ్డలు కొనలేదు అని. అదిగలగ కొలతలు దీయించీసారు తమరు మాకు? ఉంచుకోండి బావ్... యీ పటా ! మళ్లా, మరొకలకి కొలదీయడంకి పనికొత్తాది"అని పట్టాకాయితం యిచ్చేసి, విసురుగా బయటికోచ్చేసాడు దాలప్పడు.

అయితే -

దాలప్పడు భూమి మీద ఆశలు కడిగేసుకోలేదు. కన్నబాబు లాటి వారి మీద గల భ్రమల్ని తుడిచేసుకున్నాడు.

*(ఆంధ్రప్రభ- ఆదివారం అనుబంధం 19.12.93.)*